

టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్‌ను ప్రారంభించిన టీజీఎస్ ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం మధుసూదన్ తదితరులు

టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్ ప్రారంభం

నల్లకుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్ల ద్వారా హోం డెలివరీ సేవలు అందుబాటులో ఉంటాయని టీజీఎస్ ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం మధుసూదన్ అన్నారు. లాజిస్టిక్స్ కౌంటర్ల ద్వారా అందుబాటులోకి వచ్చిన కొరియర్, కార్గో పార్సిల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం నల్లకుంట డివిజన్‌లోని ఫీవర్ ఆస్పత్రి ఎదురుగా టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ నూతన కౌంటర్‌ను ఏటీఎం లాజిస్టిక్ (కార్గో) వెంకటనారాయణలతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. లాజిస్టిక్స్ సేవలకు ప్రజల నుంచి మంచి స్పందన కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ జి.శ్రీకాంత్, మార్కెటింగ్ సిబ్బంది సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

9న హైదరాబాద్ బస్ భవన్ ఎదుట మహాధర్నా

- సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు

నల్లకుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్త్రీలకు ఉచిత బస్ ప్రయాణం అని ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల బస్సులను తగ్గించడం ప్రభుత్వం కుట్రపూరిత చర్య అని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. డిసెంబర్ 4, 9వ తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా బస్ డిపోల ఎదుట ధర్నా, హైదరాబాద్ బస్ భవన్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు శుక్రవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన వెల్లడించారు.



కాచిగూడలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బర్కత్‌పుర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ రోడ్‌లో శుక్రవారం ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన టీ కొట్టులు, మిర్చి, చెరుకు రసం బండ్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. ఫుట్‌పాత్‌లపై అక్రమ వ్యాపారం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ అనిల్‌గౌడ్, సిబ్బంది నారాయణరెడ్డి, అశోక్, సుబ్బారెడ్డి, నర్సింహులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో విద్యార్థుల మృతిపై విచారణ జరిపించాలి

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

బర్కత్‌పుర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థుల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యత లేని భోజనం పెట్టడం వల్ల విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని హెచ్చరించారు. విద్యార్థుల మరణాలకు గురుకులాలు కేంద్రాలుగా మారుతున్నాయని పేద పిల్లలను విద్యకు దూరం చేయాలని ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. గురుకులాలు, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, మంచి వసతి కల్పించాలని, ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కె.శ్రీధర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, నాయకులు రాజేశ్వరి, సరోజ, లలిత తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉన్నాం

- నెలలు గడిచినా మాకు న్యాయం జరగడంలేదు
- స్వామి వివేకానందనగర్ బస్తీవాసుల ఆవేదన



మాట్లాడుతున్న ఆనంద్‌రావు

చిక్కడపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ శ్రీ స్వామివివేకానందనగర్ బస్తీవాసుల ఇళ్లను రెవెన్యూ జీహెచ్‌ఎంసీ వారు కూల్చి పదకొండు నెలలు అవుతుంది. ఇప్పటివరకు తమకు న్యాయం జరగడంలేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానం తమకు న్యాయం చేస్తుందని ఎదురుచూస్తున్నామని బస్తీవాసులు పేర్కొన్నారు. శుక్రవారం బస్తీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు ఆనంద్‌రావు, ఎంబి కృష్ణ, భారతి, ఇందు, ఝాన్సీ జ్ఞానేశ్వర్ తదితరులు మాట్లాడుతూ కూల్చివేసిన స్థలంలో రోడ్డు వేయడానికి అధికారులు వస్తే రోడ్డు వేయడానికి కోర్టు ఆర్డర్ తాము కోరడంతో అధికారులు ఇటీవల వెళ్లిపోయారని వారు స్పష్టం చేశారు. కోర్టు ద్వారా తమకు న్యాయం జరిగేవరకు రోడ్డు పనులు ఆపాలని తాము కోరామన్నారు.



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులు

నీటి బిల్లుల చెల్లింపు గడువును పొడిగించాలి

- బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు

బర్కత్‌పుర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో మంచినీటి బిల్లుల చెల్లింపు గడువును పొడిగించాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీలోపు బిల్లుల చెల్లింపు గడువు విధించారని, దీనిని డిసెంబర్ 15 వరకు పొడిగించాలన్నారు. శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. జంటనగరాలలో మంచినీటి బిల్లుల చెల్లింపు కోసం పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్, నాయకులు పవన్‌కుమార్, నర్సింగ్‌రావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం



కవాడిగూడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ పీఎస్ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దోమలగూడ పీఎస్ ఎస్ఐ నిరంజన్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పీఎస్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ

- దీక్షా దివస్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష వల్లనే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోపాల్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించి అనంతరం ర్యాలీగా తెలంగాణ భవన్‌కు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారని అన్నారు. కార్యక్రమాలలో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, సీనియర్ నాయకులు వి.సుధాకర్ గుప్తా, రేషం మల్లేష్, ముఠా నరేష్, కేశవపురం అరుణ్, చిట్టి, గోక నవీన్, వివిధ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి, ఎం.రాకేష్, వై.శ్రీనివాస్, వల్లాల శ్యామ్‌యాదవ్, నాయకులు కె.సురేందర్, వివేక్, దీన్‌దయాల్‌రెడ్డి, వల్లాల శ్రీనివాస్ యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సత్కారం

దీక్షా దివస్ వేడుకల్లో భాగంగా రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులకు రాంనగర్ చౌరస్తాలో అమరవీరుల స్థూపం వద్ద సన్మానం చేశారు. ఉద్యమకారులు పెంటారెడ్డి, రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, నేత శ్రీనివాస్, భిక్షపతి యాదవ్, ఎర్రం శేఖర్, కాల్వ గోపి, బాల్‌రాజ్‌గౌడ్, టక్కర్ శ్రీనివాస్, సిరిగిరి కిరణ్, రాజుగౌడ్, నర్సింగ్‌రావులను సత్కరించారు.

బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో

దీక్షా దివస్‌లో భాగంగా బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రమోహన్ ఆధ్వర్యంలో రెడ్ బిల్డింగ్ చౌరస్తా వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, మిరియాల శ్రీనివాస్, అరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కు చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

దీక్షా దివస్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

చిక్కడపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ఉద్యమంతోనే తెలంగాణ వచ్చిందని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముదారపు రాకేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్‌లోని జవహర్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దీక్షా దివస్ సభకు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

ఇందిరాపార్కు చౌరస్తాలో

కవాడిగూడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దీక్షా దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం బీఆర్ఎస్ నగర నాయకుడు కల్వగోపి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ చేపట్టిన దీక్ష దివస్ వల్లనే కేంద్ర ప్రభుత్వం తలొగ్గి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించిందని ఆయన అన్నారు.



రాంనగర్ చౌరస్తాలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో

దక్షా దివస్ సందర్భంగా తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలని కేసీఆర్ లాంగ్‌లీవ్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

కేసీఆర్ పోరాట ఫలితమే రాష్ట్రం ఏర్పాటు

ముషీరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ తన ప్రాణాలకు తెగించి రాష్ట్ర సాధన కోసం 11 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేశారని, అందువల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దీక్ష దివస్‌లో భాగంగా ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ నుంచి ర్యాలీగా తరలివచ్చి రాంనగర్‌లోని అమర వీరుల స్థూపంవద్ద నివాళులర్పించారు.

కేసీఆర్, కేటీఆర్‌ల రాజీలేని పోరాటం

ముషీరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌లు రాజీలేని పోరాటాలు చేస్తున్నారని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం లగచర్లలో ఫార్మాసిటీ కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకున్న సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో

నల్లకుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చరిత్ర మలుపు తిప్పిన రోజు దీక్షా దివస్ అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ ఆధ్వర్యంలో దీక్షా దివస్‌లో భాగంగా శుక్రవారం ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు.



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



బీజేపీ గోల్నాక డివిజన్ పార్టీ కోర్ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న పార్టీ డివిజన్‌అధ్యక్షుడు రవీందర్‌గౌడ్

కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను ఎండగడుతూ

నేటి నుంచి బీజేపీ నిరసన

గోల్నాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలకు మోసం చేస్తుందని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ తీరును నిరసిస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 30వతేదీ నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేసరి నర్సింగ్‌రావుయాదవ్, పార్టీ నగర కార్యవర్గ సభ్యులు మరికంటి కృష్ణంరాజు, కె.రాంచందర్, పార్టీ డివిజన్ ప్రధానకార్యదర్శులు ఆర్.వి.ఎల్.రమేష్, కర్రీ రవీందర్, పార్టీ నాయకులు వై.దామోదర్‌నాయుడు, మహ్మద్ సలీమ్, మహ్మద్ ఖాజా, సూదగాని శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి

- ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఐక్యంగా ఉన్నప్పుడే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌కు చెందిన గ్రేటర్ హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.రాజేందర్ బీసీల న్యాయమైన హక్కుల సాధన కోసం, బీసీ కులగణన కోసం చేస్తున్న పోరాటాన్ని అభినందిస్తూ ఎమ్మెల్యే ముఠాగోపాల్ రాజేందర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు సముచిత స్థానం లభించినప్పుడే హక్కులను సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాంనగర్, గాంధీనగర్, అడిక్‌మెట్, కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు శంకర్ ముదిరాజ్, రాకేష్ కుమార్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, పార్టీ నాయకులు సాయి, టీఆర్ గోవింద్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలో విజేతలను సత్కరించిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిపో మేనేజర్ కిషన్‌రావు తదితరులు

ఆర్టీసీ ముషీరాబాద్ డిపో ఆధ్వర్యంలో

వనభోజనం, ఉద్యోగులకు ఆటల పోటీలు

రాంనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నిర్వహించే వనభోజనం, వివిధ రకాల ఆటల పోటీలు ఆర్టీసీ ఉద్యోగులలో ఐక్యతతో పాటు కుటుంబ వాతావరణం కల్పించేందుకు దోహదపడతాయని ఆర్టీసీ చార్మినార్ జోన్ రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ రిజినల్ మేనేజర్ జగన్ నాయక్‌లు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ ముషీరాబాద్ డిపో మేనేజర్ కిషన్‌రావు ఆధ్వర్యంలో డిపో ఆవరణలో వనభోజనం, ఉద్యోగులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిపో అధికారులు ఎస్.ఎన్.చారి, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా భవానీ శంకరస్వామి కల్యాణం

ముషీరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ దేవుని తోటలోని ప్రసిద్ధిగాంచిన భవానీ శంకర ఆలయంలో శుక్రవారం సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయంలో రుద్రాభిషేకం, చండీహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో జ్యోతి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు -చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి



అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న గురుస్వామి రఘురామ్ గుప్తా, రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గుప్తా తదితరులు

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ

రాంనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని ఉదయ్‌నగర్ కాలనీలో గురుస్వాములు చొక్కారపు రఘురామ్ గుప్తా, రజనీకాంత్ గుప్తా, శ్రీకాంత్‌గుప్తాల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి 41వ మహాపడి పూజ ఘనంగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.సుధాకర్‌గుప్తా, సభ్యులు పులిగిల్ల కృష్ణమూర్తి, రామనాథం, తొలుపూనూరి సత్యం, మల్లేష్, సత్యవర్ధన్, అశోక్, శ్రీనివాస్, శశి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

చిక్కడపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధరణి శ్రీ ఫౌండేషన్ సనాతన ధర్మ పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ లోక కల్యాణార్థం వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం చిక్కడపల్లిలో వైభవంగా జరిగింది. ఫౌండేషన్ చైర్మన్ సంపన్నుడుంబై వెంకటాచార్యులు, శేషకుమారి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు అధికారి రామ్మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశంసనీయం పాత, కొత్త పాటల గానం



ప్రసంగిస్తున్న దైవజ్ఞశర్మ, రమ్య

చిక్కడపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అలనాటి పాత పాటలతోపాటు కొత్త సినిమా పాటల గానం ప్రశంసనీయమని సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ అన్నారు. ప్రజ్ఞా ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో గాన విభావరి కార్యక్రమంల కళాపోషకులు లయన్ విజయ్‌కుమార్ జ్ఞాపకంగా జరిగింది. గాయని రమ్య ఆధ్వర్యంలో పలువురు గాయనీగాయకులు గీతాలు మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా దైవజ్ఞశర్మ పాల్గొని రమ్యను సత్కరించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రంథాలయ అధికారి కిరణ్‌జ్యోతి



గ్రంథాలయ దినోత్సవంలో పాల్గొన్న గ్రంథాలయ అధికారి కిరణ్‌జ్యోతి, ప్రిన్సిపాల్ మట్టశేఖర్ తదితరులు

రాంనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలలోని పుస్తక బండాగారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కిరణ్‌జ్యోతి అన్నారు. పుస్తక పఠనంపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించేందుకు విద్యా సంస్థలు, బోధన అధికారులు కృషి చేయాలని సూచించారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కాలేజీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం 57వ అంతర్జాతీయ గ్రంథాలయ వారోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, గ్రంథ పఠన కార్యక్రమం ఆమె పరిశీలించి విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. గ్రంథాలయాలు సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేవారికి ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల మట్టశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జనకు అనుమతి ఇవ్వడం ద్రోహమే

- మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ తదితరులు

రాంనగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు నిర్వహిస్తున్న మాలల సింహ గర్జనకు పరేడ్ గ్రౌండ్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అనుమతి ఇప్పించడం మాదిగలకు ద్రోహం చేయడమేనని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఆరోపించారు. శనివారం విద్యానగర్‌లో జరిగిన తెలంగాణ మాదిగ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుకూలంగా వివిధ రాష్ట్రాల సీఎంలు ఎస్సీలను ఏబీసీడీలుగా చేసుకోవచ్చని తీర్పు మేరకు తెలంగాణతో పాటు మిగత రాష్ట్రాలు ఈ ప్రక్రియ ప్రారంభించిన నేపథ్యంలో మాలలు వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహ గర్జన సభకు కేంద్ర ప్రభుత్వం నుంచి కిషన్‌రెడ్డి అనుమతి కల్పించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి మాదిగల పక్షాన ఉన్నారో మాలల పక్షాన ఉన్నారో బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాలల సింహగర్జనకు మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు వెళ్లవద్దని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గెల్వయ్య, యువజన రాష్ట్ర అధ్యక్షుడు మంచాల యాదగిరి, పల్లెటి లక్ష్మణ్; పొలిట్‌బ్యూరో సభ్యులు సుదర్శన్, నాయకులు భీమ్, వి.జ్యోతి, జి.డి.నర్సింహ, సంగపాక యేసుపు, బోడ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.